

హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులను సన్మానించిన నక్క వెంకటమ్మ, యాదగిరియాదవ్

ఉపాధ్యాయినులకు ఘన సన్మానం

హయత్‌నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం హయత్‌నగర్ జిల్లా పరిషత్ పాఠశాలలో నక్క వెంకటమ్మ, యాదగిరి, స్వామియాదవ్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా నక్క వెంకటమ్మ, యాదగిరి, స్వామి యాదవ్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ ఫౌండేషన్ చైర్మన్ నక్క శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తూ దేశాభివృద్ధిలో ప్రముఖపాత్ర పోషిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మహిళా ఉపాధ్యాయులందరినీ శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు ఇందిర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రతీ మంగళవారం 'రైతు నేస్తం'



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ప్రతీ మంగళవారం ఆయా మండలాల్లో ఉన్న రైతువేదికల్లో నిర్వహించే రైతు నేస్తం కార్యక్రమంలో రైతులంతా పాల్గొని శాస్త్రవేత్తల సూచనలు, సలహాలు తీసుకుని అధిక దిగుబడి సాధించాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు కోరారు. మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రైతులకు తగిన సూచనలు, సలహాలు అందించేందుకు ప్రభుత్వం రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమాలు నిర్వహిస్తుందని తెలిపారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాగుపద్ధతులను మార్చుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ సుజాత, మండల వ్యవసాయ అధికారి పల్లవి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కార్పొరేటర్



ఆరోగ్య కేంద్రం సిబ్బందితో మాట్లాడుతున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

వనస్థలిపురం మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని సాహెబ్‌నగర్ బస్తీ దవాఖానా, అర్బన్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని మంగళవారం కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి సందర్శించారు. యూపీహెచ్‌సీలో రెండు నెలలుగా డాక్టర్ అందుబాటులో లేకపోవడంతో నర్సులే వైద్యం చేస్తున్నారని రోగులు, స్థానికులు ఆయనకు తెలుపడంతో సంబంధిత ఉన్నతాధికారులపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు నెలల నుంచి డాక్టర్ లేకపోవడం వల్ల ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యం ఎలా అందుతుందని ప్రశ్నించారు. ఆరోగ్యకేంద్రంలో నెలకొన్న సమస్యలు రోగులకు అందుతున్న వైద్యం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సంబంధిత డీఎంహెచ్‌ఓతో మాట్లాడి డాక్టర్‌ను త్వరలోనే నియమించేదుకు చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు.

ప్రణయ్ హత్యకేసులో కోర్టు తీర్పు హర్షణీయం

మన్సూరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): గతంలో మిర్యాలగూడలో కులాంతరం వివాహం చేసుకున్న ప్రణయ్‌ని పరువు కోసం అతికిరాతకంగా హత్య చేసిన నిందితులకు ఉరి, యావజ్జీవ శిక్ష విధిస్తూ నల్గొండ ఎస్సీ, ఎస్టీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం వెలువరించిన తీర్పుపై జై భారత్ సామాజిక విప్లవ రణభేరి హర్షించింది. ఈ సందర్భంగా మన్సూరాబాద్ డివిజన్ సూర్యోదయ కాలనీలోని జైభారత్ ఉద్యమం కేంద్ర కార్యాలయంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి గోల సత్యనారాయణ మాట్లాడుతూ..ఈ తీర్పు కుల అహంకారులకు కులోన్మాదులకు కనువిప్పు కావాలన్నారు. కులాంతర ప్రేమ జంటలపై కులోన్మాదుల దాడులను అరికట్టేందుకు ప్రత్యేక బృందాన్ని కేంద్రీకృత టోల్ ఫ్రీ నెంబర్‌ను ఏర్పరచాలన్నారు.

మలక్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌కు రివార్డు



మలక్‌పేట ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ గోపాల్ నాయక్‌కు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ డైరక్టర్ కమల్‌హాసన్‌రెడ్డి మంగళవారం నగదు బహుమతి అందజేశారు. మెదక్‌లో 2017లో నాలుగు కేజీల నిషేధిత అల్ప్రాజోం స్వాధీనం చేసుకున్న కేసులో కోర్టు ఇటీవల నిందితుడికి పదేళ్ల శిక్ష విధించింది. ఈ కేసులో విచారణాధికారిగా ఉన్న గోపాల్ నాయక్‌ను డైరక్టర్ అభినందిస్తూ రివార్డు అందజేశారు.

-సైదాబాద్, (ఆంధ్రజ్యోతి)

కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ శ్రీవాణి అంజన్

ఎల్బీనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ స్థలాన్ని కబ్జాకోరుల నుంచి పరిరక్షించాలని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి అంజన్ సరూర్‌నగర్ తహసీల్దార్ పి.వేణుగోపాల్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆకుల శ్రీవాణి అంజన్ మాట్లాడుతూ డివిజన్ పరిధి సర్వే నం.24లోని ప్రభుత్వ భూమిలో ప్లాట్ నంబర్.29తో 300గజాలలో ఖాళీ స్థలం ఉందని, అట్టి స్థలం తమదేనంటూ తప్పుడు పత్రాలను సృష్టించి టేకుమట్ల యాదయ్య అనే వ్యక్తి కబ్జాచేసేందుకు ప్రయత్నిస్తున్నాడన్నారు. వెంటనే సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకుని ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జవహర్ యువజన సంఘం అధ్యక్షుడు సాతెల్లి నాగరాజు, కట్ట జైహింద్ బాబు, అకిట్ల దేవేందర్ ముదిరాజ్, గోవర్ధన్ తదితరులు ఉన్నారు.

చిత్రా లేఅవుట్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా పెండ్యాల

ఎల్బీనగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఆర్కేపురం డివిజన్ చిత్రా లేఅవుట్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికల్లో అధ్యక్షుడిగా మరోసారి పెండ్యాల నగేష్ ఎన్నికయ్యారు. ప్రధానకార్యదర్శిగా గణేష్, కోశాధికారిగా మల్లికార్జున్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నగేష్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, అధికారుల సహాయ సహకారాలతో చిత్రాలేఅవుట్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. సహకరించిన చిత్రాలేఅవుట్ ఓటర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

రంగారెడ్డి జిల్లా జీపీగా తిరుమల్‌రెడ్డి



రంగారెడ్డి జిల్లా కోర్టులు, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టుల ప్రభుత్వ ప్లీడరుగా బానాల తిరుమల్‌రెడ్డి నియమితులయ్యారు. ప్రభుత్వం ఆయనను జీపీగా నియమిస్తూ ఉత్తరువులు జారీ చేసింది. ప్రభుత్వం తరఫున ఆయన సివిల్ కేసులను చూడనున్నారు. ఆయన మూడు సంవత్సరాలు లేదా తొలగించే వరకూ ఈ పదవిలో కొనసాగనున్నారు.

చంద చెరువు నిండా గుర్రపుడెక్క

- తొలగించేది ఎప్పుడంట..?!
- సబితారెడ్డి ఆదేశాలు బేఖాతరు
- అధికారుల నిర్లక్ష్యం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు, వాకర్లు



జిల్లెలగూడ చందచెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క

సరూర్‌నగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితారెడ్డి తరచుగా మీర్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని చెరువులను సందర్శిస్తుంటారు. తన డ్రీమ్ ప్రాజెక్టుగా చెప్పుకునే చెరువుల సుందరీకరణపై ఆమె ప్రత్యేక దృష్టి సారించి.. క్యాంపు కార్యాలయానికి వచ్చినప్పుడుగానీ, స్థానికంగా వేరే కార్యక్రమాలు ఉన్నాగానీ తప్పనిసరిగా చెరువుల వైపు ఓ అడుగు వేసి వెళ్తుంటారు. సుందరీకరణ పనులను వేగవంతం చేయాలని, అంతకన్నా ముందుగా చెరువుల్లో పేరుకుపోయిన గుర్రపుడెక్కను తొలగించాలని ఆమె అధికారులను ఆదేశిస్తుంటారు. అయితే ఆమె కలల ప్రాజెక్టుకు అధికారులు తూట్లు పొడుస్తున్నారు. సబిత ఆదేశాలను ఏమాత్రం పట్టించుకుంటున్న దాఖలాలు కనిపించడం లేదు. దానికి ప్రత్యక్ష ఉదాహరణ.. నేటికీ చెరువుల్లో పచ్చగా పేరుకుపోయిన గుర్రపుడెక్కే..! అధికారుల నిర్లక్ష్యాన్ని వెక్కిరిస్తున్న జిల్లెలగూడలోని చందచెరువులో గుర్రపుడెక్క తీరుపై ప్రత్యేక కథనం...

దుర్వాసన.. దోమల బెడద..

చందచెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో అనేక మంది ఇక్కడకు వచ్చి వాకింగ్ చేస్తుంటారు. అదేవిధంగా చెరువు పక్కన చిల్డ్రన్స్ పార్క్, బతుకమ్మఘాట్ సైతం అందుబాటులో ఉండడంతో మహిళలు, చిన్నారులు కూడా చందచెరువు వద్దకు వస్తుంటారు. అయితే అక్కడకు వచ్చే ప్రతి ఒక్కరికీ చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్క స్వాగతం పలుకుతోంది. గుర్రపుడెక్క కింద మురుగునీరు, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి పరిసరాలను దుర్గంధభరితం చేస్తోంది. దోమలు సైతం స్వైరవిహారం చేస్తున్నాయి. దాంతో వాకర్స్‌తో పాటు మహిళలు, పిల్లలు సైతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సబిత ఆదేశాలు పట్టించుకునే వారేరీ..?!

చెరువుల వద్ద పర్యటించిన ప్రతిసారీ ఎమ్మెల్యే సబితారెడ్డి అధికారులకు ముందుగా చెప్పే మాట.. గుర్రపుడెక్క తొలగింపుపై దృష్టి పెట్టండని! హెచ్‌ఎండీఏ నుంచి గానీ, మునిసిపల్ నుంచి గానీ నిధులు కేటాయించి వెంటనే గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టండంటూ ఆమె తరచూ అధికారులకు స్పష్టంగా చెబుతున్నారు. అయితే అధికారులు ఆమె మాటను చెవికెక్కించుకోవడం లేదనే విమర్శలు వినవస్తున్నాయి. చెరువుల సుందరీకరణ బాధ్యతలు చేపట్టిన హెచ్‌ఎండీఏ అధికారులు కనీసం ఇటు వైపు కన్నెత్తి కూడా చూడడంలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్థానికులకు దోమల బెడద, కంపువాసన నుంచి విముక్తి కల్పించాలంటే చెరువులో పేరుకుపోయిన గుర్రపుడెక్కను సత్వరమే తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మీర్‌పేట్ మునిసిపల్ అధికారులు, హెచ్‌ఎండీఏ అధికారులు ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కనిష్క్‌రెడ్డికి నివాళి

సంతాప సభలో పాల్గొన్న మాజీ మంత్రులు కేటీఆర్, మహమూద్‌అలీ, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



కనిష్క్‌రెడ్డి తల్లి మాజీ కార్పొరేటర్ సునరితరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న కేటీఆర్

మన్సూరాబాద్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో ముసారంబాగ్ మాజీ కార్పొరేటర్ తీగల సునరితరెడ్డి కుమారుడు కనిష్క్‌రెడ్డి మృతి చెందిన విషయం తెలిసిందే. కనిష్క్‌రెడ్డి సంతాప సభను మంగళవారం నాగోల్, బండ్లగూడలోని పీబీఆర్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ హోంశాఖ మంత్రి మహమూద్‌అలీ హాజరై స్థానిక ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డితో కలిసి కనిష్క్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కనిష్క్‌రెడ్డి తల్లిదండ్రులు తీగల అజిత్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సునరితరెడ్డిని పరామర్శించారు. పరామర్శించిన వారిలో మాజీ కార్పొరేటర్లు, నాయకులు ఉన్నారు.

ప్లంబర్స్ సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

వనస్థలిపురం, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగంలో పనిచేస్తున్న ప్లంబర్స్ సమస్యల పరిష్కారానికి తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం ప్లంబర్స్ డే సందర్భంగా బీఎన్‌రెడ్డి డివిజన్ వైదేహినగర్‌లో జరిగిన కార్యక్రమంలో ప్లంబర్స్‌కు ఎమ్మెల్యే లేబర్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్లంబర్స్‌కు వృత్తిపరమైన ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తనను కలువొచ్చని ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి వారి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు కటికరెడ్డి అరవిందరెడ్డి, అనిల్‌చౌదరి, మాధవరం నర్సింహారావు, సతీష్ కుమార్‌గౌడ్, రవి ముదిరాజ్, రాఘవేంద్రరావు, మనోజ్‌కృష్ణ, శ్రీశైలం, రాజుగౌడ్, కళ్యాణ్ ప్లంబర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, శివప్ప తదితరులు పాల్గొన్నారు

పోలీస్ ఔట్‌పోస్టును ఏర్పాటు చేయండి

- రాచకొండ కమిషనర్‌ను కోరిన పండ్ల మార్కెట్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి



రాచకొండ సీపీకి వినతిపత్రం ఇస్తున్న గడ్డిఅన్నారం పండ్ల మార్కెట్ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): బాటసింగారంలోని పండ్ల మార్కెట్‌లో మామిడి సీజన్ ప్రారంభం కాబోతున్న సందర్భంగా పండ్ల మార్కెట్‌లో పోలీస్ ఔట్ పోస్టును ఏర్పాటు చేయాలని రాచకొండ కమిషనర్‌ను పండ్ల మార్కెట్ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు మంగళవారం పాలకవర్గం సభ్యులతో కలిసి రాచకొండ సీపీ సుధీర్ బాబును కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఈసారి మామిడి క్రయ విక్రయాలు అధికంగా జరిగే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుందన్నారు. మార్కెట్ సమీపంలో అనుమతి లేకుండా కొందరు వ్యాపారులు క్రయవిక్రయాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అలాంటి వారిపై పోలీసులు గట్టి నిఘాను ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. మార్కెట్‌లో దొంగతనాలు కూడా జరుగుతున్నాయని, మార్కెట్‌లో దిగుమతులు తగ్గించేందుకు కొందరు వ్యక్తులు ప్రయత్నిస్తున్నారని అన్నారు. దీని వల్ల మార్కెట్‌కు ఆదాయం తగ్గుతుందన్నారు. విజిలెన్స్ అధికారులను రంగంలోని దించి వారి ఆటలు కట్టించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ భాస్కరచారి, పాలకవర్గం సభ్యులు జైపాల్‌రెడ్డి, గణేష్‌నాయక్, చెన్నారెడ్డి, రఘుపతిరెడ్డి, అంజయ్య, వెంకటేశ్వర్లుగుప్త తదితరులు పాల్గొన్నారు.



ప్లాన్‌ను పరిశీలిస్తున్న జోనల్ కమిషనర్ హేమంత కేశవ్ పాటిల్

ఎల్‌బీనగర్ కూడలి అభివృద్ధికి చర్యలు

ఎల్‌బీనగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ కూడలి అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత కేశవ్‌పాటిల్ తెలిపారు. మంగళవారం కార్పొరేటర్లు దరిపల్లి రాజశేఖర్‌రెడ్డి, కొప్పుల నర్సింహారెడ్డితో కలిసి ఎల్‌బీనగర్‌లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎల్‌బీనగర్ కూడలిలో చేపట్టనున్న అభివృద్ధిపై ఆయన క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీ నవీన్‌రెడ్డి, ఉపకమిషనర్లు తిప్పర్తి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆరోగ్య పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలి



రోగులకు పరీక్షలు చేస్తున్న డాక్టర్ తరుణి

ఓల్డ్‌మలక్‌పేట, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజల ఆరోగ్యం కోసం ఇంటింటా వైద్యపరీక్షలు నిర్వహిస్తుందని ఈ వైద్యపరీక్షలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మలక్‌పేట అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తరుణి అన్నారు. ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో నాన్ కమ్యూనికేబుల్ డీసీస్(ఎన్‌సీడీ)సర్వే కొనసాగుతుంది. ఇందులో భాగంగా డివిజన్‌లో 28 మంది ఆశాకార్యకర్తలు, ఏఎన్‌ఎంలు ఇంటింటికీ తిరిగి వైద్యపరీక్షలు చేస్తున్నారు. 30 సంవత్సరాలు పైబడిన వారికి బీపీ, షుగర్, బ్రెస్ట్‌క్యాన్సర్, ఓరల్‌క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ వ్యాధినిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి ఉచితంగా మందులు అందిస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ తరుణి మాట్లాడుతూ ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో 17వేల మందికి స్క్రీనింగ్ టెస్టులు చేయ్యాల్సి ఉండగా ఇప్పటి వరకు 10వేల మందికి వైద్యపరీక్షలు చేసినట్లు తెలిపారు. ఎన్‌సీడీ సర్వే ఈనెల 20వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. ఈలోగా నిర్దేశించిన వారందరికీ టెస్టులు చేస్తామన్నారు.

ఘనంగా అయ్యప్పస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు

హాజరైన ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి



అయ్యప్పస్వామి ఆలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి



గోపూజ చేస్తున్న చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి

చంపాపేట, మార్చి 11(ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్ ఇన్నర్‌రింగ్ రోడ్ డిఫెన్స్ కాలనీలోని హరిహర క్షేత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధలతో ఆరంభమయ్యాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి, ఆలయ వ్యవస్థాపకులు, చంపాపేట కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరై పూజలు చేశారు. మొదటిరోజు ఆలయంలో వివిధ పూజా కార్యక్రమాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ వంగా చంద్రారెడ్డి, డైరెక్టర్లు సందీప్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, దశరథ్‌గౌడ్, రమేష్‌గౌడ్, విజ్ఞేశ్వర్‌రెడ్డి, హరికృష్ణగుప్తా, సూర్యప్రకాష్‌గుప్తా, శ్రీనివాస్‌గుప్తా, నిర్మలేష్‌గుప్తా, మల్లిఖార్జున్‌గుప్తా, నరేందర్‌రెడ్డి, మణిపాల్‌రెడ్డి, కేశవరెడ్డి, సత్యనారాయణ, భిక్షపతిగౌడ్, కృష్ణగౌడ్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కల్తీనూనె వ్యాపారి అరెస్ట్

- హోల్‌సేల్ దుకాణంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి
- 1,014 లీటర్ల కల్తీనూనె స్వాధీనం



పోలీసులు స్వాధీనం చేసుకున్న కల్తీనూనె

చాదర్‌ఘాట్, మార్చి11(ఆంధ్రజ్యోతి): మలక్‌పేట గంజ్‌లో అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్న వంట నూనె హోల్‌సేల్ దుకాణంపై సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడిచేశారు. గడువు ముగిసిన స్టికర్లతో కూడిన నూనె 107 బాటిళ్లు, 13 టిన్లు, తేదీ లేని స్టికర్లు ఉన్న 38 టిన్లు మొత్తం 1,014 లీటర్ల ఆయిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. యాజమానిని అరెస్టు చేశారు. స్వాధీనం చేసుకున్న ఆయిల్ విలువ సుమారు రూ.1.90లక్షల ఉంటుందని పోలీసులు తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం సౌత్ ఈస్ట్ టాస్క్ పోలీసులు, ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి మలక్‌పేట మహబూబ్ మాన్షన్ మార్కెట్(గంజ్)లోని గణేష్ ఆయిల్ లక్ష్మాతర్ ఆయిల్‌పై దాడి చేశారు. లైసెన్స్ లేకుండా దుకాణం నిర్వహిస్తూ, లూజ్ ఆయిల్ కొనుగోలు చేసి గడువు ముగిసిన లేబుల్స్‌తో రీప్యాక్ చేస్తున్నట్లు గుర్తించారు.. అంతేగాకుండా గడువు ముగిసిన బ్రాడెండ్ కంపెనీ లేబుల్స్‌ను వైట్‌నర్‌లను ఉపయోగించి తేదీలు, బ్యాచ్ నెంబర్లు మారుస్తూ వినియోగదారులకు సరఫరా చేస్తూ అక్రమంగా లాభాలు గడిస్తున్నారు. ఈ మేరకు దుకాణంపై దాడిచేసి, యాజమాని ఆశోక్‌కుమార్ అగర్వాల్‌ను అరెస్ట్ చేశారు. ఈ దాడులు సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సైదాబాబు ఆధ్వర్యంలో జరిగాయి.

4 తులాల బంగారు ఆభరణాలు చోరీ



దొంగలు బీరువా తాళాలు తెరిచి, చిందరవందరగా వేసిన వస్తువులు

అబ్దుల్లాపూర్‌మెట్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): ఇంటి తాళాలు పగుటగొట్టి ఇంట్లో నగలు, నగదును అపహరించిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. భూదాన్ పోచంపల్లి మండలం జూలూరుకు చెందిన నీరుడు సతీష్ కొంత కాలంగా కుటుంబ సభ్యులతో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడ్‌పల్లి గ్రామంలోని ఉదయ్‌గార్డెన్ కాలనీలో నివాసం ఉంటున్నాడు. సొంతూరు జూలూరులో జరుగుతున్న జాతరకు సోమవారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూడగా ఇంటి తాళం ధ్వంసం చేశారు. ఇంట్లో బీరువాలో ఉన్న నాలుగు తులాల బంగారు, కిలో వెండి ఆభరణాలు కన్పించలేదు. దీంతో సతీష్ అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు క్లూస్ టీంలను రప్పించి వెలిముద్రలను సేకరించారు. దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. ఈ మేరకు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సరూర్‌నగర్ పీఎస్‌లో రాచకొండ సీపీ పరిశీలన



రికార్డులు పరిశీలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

దిల్‌సుఖ్‌నగర్, మార్చి 11(ఆంధ్రజ్యోతి): విజుబుల్ పోలీసింగ్‌కు పెద్దపీట వేస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు అందులో భాగంగా సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. పీఎస్‌లో శాంతి భద్రతల పరిరక్షణ, సిబ్బంది పనితీరు, సామాన్య ప్రజలకు అందుతున్న సేవలపై సమీక్షించారు. అనంతరం విజిబుల్ పోలీసింగ్ కార్యక్రమంలో భాగంగా స్వయంగా స్థానిక ప్రజలతో మమేక్షమై వారి స్పందనను తెలుసుకున్నారు. అనంతరం స్టేషన్ రికార్డులను పరిశీలించారు. రిసెప్షన్, పెట్రోలింగ్ స్టాఫ్ విభాగాల పనితీరు, సీసీటీవీల నిర్వహణ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సిబ్బంది ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. మహిళా భద్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు.



గ్రీన్‌పార్క్‌కాలనీలో పర్యటిస్తున్న చీఫ్ ఇంజినీర్ భాస్కర్ రెడ్డి, కార్పొరేటర్ రాజశేఖర్‌రెడ్డి

బాక్స్‌డ్రైన్ పనుల పరిశీలన

ఎల్బీనగర్, మార్చి 11 (ఆంధ్రజ్యోతి): లింగోజీగూడ డివిజన్ గ్రీన్‌పార్క్ కాలనీలో చేపడుతున్న బాక్స్‌డ్రైన్ పనులను మంగళవారం కార్పొరేటర్ దరిపల్లి రాజశేఖర్ రెడ్డితో కలిసి జీహెచ్‌ఎంసీ చీఫ్ ఇంజినీర్ భాస్కర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాక్స్‌డ్రైన్ పనుల అనంతరం వెంటనే రోడ్డు నిర్మాణంతో పాటు సిల్ట్ తొలగింపజేస్తానని హామీ ఇచ్చారు. శంకేశ్వర్‌బజార్ వద్ద ఔట్‌లెట్ డీ సిల్టింగ్ చేసి వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుధీర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, కాలనీవాసులు జగన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, బాల్‌రెడ్డి, ఆంజనేయులు గౌడ్, కాశీనాథ్‌గౌడ్, సుధాకర్, మధుసూదన్, సువర్ణ తదితరులు ఉన్నారు.